కుష్టు కేసుల కోసం జల్లెడ

- ఇంటింటా తిరిగి సర్వే
- సర్వే బృందంలో ఆశాలు, వలంటీర్లు
- జిల్లాలో 1,669 బృందాలు ఏర్పాటు
- జిల్లాలో 25 లక్షల జనాభా, 6,43,648 కుటుంబాలు
- ఆరు నెలల క్రితం నిర్వహించిన సర్వేలో 71 మంది కుష్టు రోగుల గుర్తింపు
- ప్రస్తుతం 191 మందికి చికిత్స

కుష్టు వ్యాధి బాధితులను చూస్తే ఇప్పటికీ చాలా మందికి అదో రకమైన భయం. వారి నుంచి ఆ వ్యాధి తమకు అంటుకుంటుందేమోనన్న ఆందోళన. అందుకే అలాంటి వారికి కాస్త దూరంగానే ఉంటారు. వారికి దగ్గరగా ఉన్నా, సపర్యలు చేసినా వ్యాధి అంటుకోదని ఓవైపు అధికారులు, మరోవైపు వైద్యులు చెబుతున్నా వివక్షత కొనసాగుతూనే ఉంది. ఇప్పటికీ వివక్షత కారణంగా చాలా మంది ఈ వ్యాధి లక్షణాలు ఉన్నా బయటకు రావడం లేదు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం ఇంటింటికి వెళ్లి వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రెండు రోజుల క్రితం ప్రారంభమైన ఈ కార్యక్రమం జిల్లాలో విస్తృతంగా కొనసాగుతోంది.
– కర్నూలు(హాస్పిటల్)

జాతీయ కుష్టు నిర్మూలన కార్యక్రమంలో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖలోని జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసీ విభాగం ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి వచ్చే నెల 16 వ తేదీ వరకు కుష్టువ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ప్రభుత్వం ఇంటింటి సర్వే నిర్వహిస్తోంది. ఇందుకు జిల్లాలో 1,669 బృందాలు బయలుదేరాయి. ప్రతి బృందంలో ఒక ఆశ, సచివాలయ వలంటీరు ఉంటారు. వారు జిల్లాలోని 24,26,723 జనాభాలోని 6,43,648 ఇళ్లను తిరిగి ప్రతి ఒక్కరినీ పలకరించి, కుష్టు వ్యాధి లక్షణాలు ఏమైనా ఉన్నాయేమోనని పరిశీలిస్తారు. అనుమానిత లక్షణాలున్న వారిని సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్య పరీక్ష చేయిస్తారు. వ్యాధినిర్ధారణ అయితే కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని కుష్టువ్యాధి విభాగం లేదా చర్మవ్యాధుల విభాగానికి పంపించి చికిత్స చేయిస్తారు. పాసివ్ బేసిల్లె(తక్కువ స్థాయిలో లెప్రసీ క్రిములు) ఉంటే 6 నెలలు, మల్టీ బేసిల్లె(అధిక శాతం లెప్రసీ క్రిములు) ఉంటే 9 నెలల పాటు మల్టీ డ్రగ్ థెరపీ(ఎండీటీ) మందులను ఉచితంగా అందజేస్తారు. జిల్లాలో ఆరు నెలల క్రితం నిర్వహించిన సర్వేలో 71 కొత్త కేసులు బయటపడగా ప్రస్తుతం 191 మంది వ్యాధిగ్రస్తులు చికిత్స పొందుతున్నారు.



ఇంటింటి సర్వేలో ప్రజలను పరీక్షిస్తున్న వైద్య సిబ్బంది

కుష్టు వ్యాధి లక్షణాలు

- ఈ వ్యాధి బ్యాక్టీరియా ద్వారా వస్తుంది.
- చర్మంపై స్పర్శలేని రాగి రంగు గల మచ్చలు
- చెవులపై బుడిపెలు, కణితులు, నరాల తిమ్మిర్లు
- మందమైన మెరిసే జిడ్డుగల చర్మం(చర్మం ఉబ్బెత్తుగా బత్తాయి తొక్కలాగా ఉండటం), చెవులపై బొడిపెలు
- కనుబొమ్మలు,కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం
- కనురెప్పలు మూతపడకపోవడం
- చేతుల నుంచి వస్తువులు జారిపోవడం
- అరచేతులు, అరికాళ్లలో స్పర్శ కోల్పోవడం
- చర్మం ఉబ్బెత్తుగా బత్తాయి తొక్కలాగా ఉండటం, చెవులపై బొడిపెలు రావడం
- తెలియకుండానేచేతులు,కాళ్లలో బొబ్బలు రావడం
- చేతివేళ్లు, కాలివేళ్లు వంకర్లు తిరిగి అంగవైకల్యం రావడం
- కాళ్లు,చేతులు తిమ్మిర్లులేక జోములుకలిగిఉండటం
- కాళ్లకు చెప్పులు జారిపోవడం
- చల్లని, వేడి వస్తువులను గుర్తించలేకపోవడం
- పాదాలు(మడిమలు) వాపు ఉండటం

ఈ లక్షణాలు ఉన్న వారిని సమీప ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తే వైద్యులు పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారు.

కుష్టువ్యాధి లక్షణాలుంటే నిర్లక్ష్యం చేయొద్దు



కుష్టు వ్యాధి లక్షణాలుంటే నిర్లక్ష్యం చేయకుండా ఇంటింటి సర్వే కోసం వచ్చిన ఆశా, వలంటీర్ బృందానికి తెలియజేయాలి. వారు ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్ష చేయించి అవసరమైన మందులను ఉచితంగా అందజేసేలా చేస్తారు. ఈ వ్యాధి బహుళ ఔషధ చికిత్స(ఎండీటీ)మందులతో పూర్తిగా నయమవుతుంది. ఇవి ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉచితంగా లభిస్తాయి. ప్రాథమిక దశలో వ్యాధిని గుర్తిస్తే వైకల్యం రాకుండా నివారించవచ్చు. అంగవైకల్యం ఉన్న వారు ఉచితంగా శస్త్రచికిత్స చేయించుకోవచ్చు. అవసరమైన వారికి కుష్టువ్యాధి విభాగంలో ఫిజియోథెరపీ కూడా చేయిస్తున్నాం.
– డాక్టర్ ఎల్.భాస్కర్, జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసీ అధికారి, కర్నూలు

క్లుప్తంగా

మెరుగైన ఆరోగ్యసేవలు అందించాలి



స్టాఫ్‌నర్సుల శిక్షణలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): రోగులకు మెరుగైన ఆరోగ్యసేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య ఆశా కార్యకర్తలకు సూచించారు. మంగళవారం స్థానిక మహిళా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఆశా కార్యకర్తల 8 రోజుల శిక్షణ కార్యక్రమాన్ని, ప్రాంతీయ శిక్షణ కేంద్రం(ఫిమేల్)లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే స్టాఫ్‌నర్సులకు ఏర్పాటు చేసిన ఆరు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న విషయాలను క్షేత్ర స్థాయిలో అమలు చేయాలన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై.ప్రవీణ్‌కుమార్, ప్రాంగణం మేనేజర్ అంజలి భూషణ్, డీపీహెచ్‌ఎన్‌ఓ ఇందిర, డెమో ప్రమీలాదేవి, హెచ్‌ఈఈఓ శ్రీనివాసులు, డీసీఎం ప్రసాద్, రిసోర్స్ పర్సన్స్ జగదాంబికా, లక్ష్మీదేవి, నారాయణమ్మ, కాంతమ్మ, రాణి, డీపీఎంయూ డాక్టర్ ఉమా, చంద్రకాంత్ యాదవ్, డాక్టర్ మారుతీప్రసాద్, డాక్టర్ రజని, డాక్టర్ సుష్మిత, డీపీఓ విజయరాజు పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.రామగిడ్డయ్య మంగళవారం ఇ.తాండ్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. అక్కడి రికార్డులను పరిశీలించి అన్ని ప్రోగ్రామ్స్‌లో వంద శాతం లక్ష్యాన్ని సాధించాలని వైద్యులకు సూచించారు. అనంతరం పంచలింగాల సచివాలయ పరిధిలో జరుగుతున్న ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ప్రోగ్రామ్‌ను తనిఖీ చేశారు.

వార్డెన్‌ను సస్పెండ్ చేయాలి

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన మెనూ అమలు చేయని ఇందిరాగాంధీ సోషల్ వెల్ఫేర్ బాయ్స్ హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయాలని డీవీఎంసీ సభ్యులు పీటీ సాయిప్రదీప్, నవీన్, మాజీ సభ్యుడు సత్తి రాజశేఖర్.. కలెక్టర్ డాక్టర్ సృజనను కోరారు. మంగళవారం వారు కలెక్టర్‌ను ఆమె చాంబరులో కలిసి హాస్టల్‌లో నెలకొన్న సమస్యలకు విన్నవించారు. మెనూ పాటించకుండా పప్పు, అన్నం మాత్రమే పెడుతున్నారని, వారంలో కేవలం ఒక్క రోజు మాత్రమే కోడిగుడ్డు ఇస్తున్నారని, తాగడానికి నీళ్లు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా వార్డెన్ పట్టించుకోవడంలేదని కలెక్టర్‌కు వివరించారు.

జీజీహెచ్ అకౌంటెంట్‌గా కుమారస్వామి



కుమారస్వామిని అభినందిస్తున్న సహఉద్యోగులు

కర్నూలు(హాస్పిటల్): స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాల అకౌంటెంట్(ఆఫీస్ సూపరింటెండెంట్)గా కుమారస్వామి బదిలీ అయ్యారు. డ్రగ్ స్టోర్‌లో ఫారెన్ డిప్యుటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా జీజీహెచ్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆసుపత్రి కార్యాయంలో బాధ్యతలు తీసుకున్న సందర్భంగా సహ ఉద్యోగులు, ఉద్యోగ సంఘాలు, ఎన్‌జీవో నాయకులు అభినందనలు తెలిపారు.

భవన నిర్మాణాలను పూర్తి చేయాలి



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): ప్రభుత్వ ప్రాధాన్యత భవన నిర్మాణాలను సెప్టెంబర్ 15 లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్ పీఆర్ ఇంజినీర్లతో సమీక్షించా రు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ విలేజ్‌క్లినిక్‌ల భవన నిర్మానాల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. భవన నిర్మాణ పనులను వారంతపు లక్ష్యాలతో పురోగతి సాధించేలా చూడాలన్నారు. జిల్లాలో 244 సచివాలయాలు, 185 రైతు భరోసా కేంద్రాలు, 179వైఎస్ఆర్ విలేజ్ క్లినిక్‌లను కచ్చితంగా సెప్టెంబర్ 15వ తేదీలోపు పూర్తి చేయాలన్నారు. పీఆర్ ఎస్‌ఈ సుబ్రహణ్యం, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ సరఫరా చేయాలి

కర్నూలు(రూరల్): మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు ఉచిత గ్యాస్ సరఫరా చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం కేకే భవనంలో ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ. 400 ఉన్న గ్యాస్ ప్రస్తుతం రూ.1,200 చేరడంతో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెరిగిన ధరలను దృష్టిలో ఉంచుకుని ఉచిత గ్యాస్ సరఫరా చేయాలన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకోవాలి

కర్నూలు(సెంట్రల్): ప్రతి ఒక్కరూ ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంచుకోవాలని పురుషుల డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ జె.హేమంత్ అన్నారు. మంగళవారం కళాశాలలో కామర్స్ విభాగం, కెనెరాబ్యాంకు సంయుక్త ఆధ్వర్యంలో ఫైనాన్సియల్ అండ్ డిజిటల్ లిటరసీ అంశంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నేటి ప్రపంచంలో ఆన్‌లైన్ లావాదేవీల్లో మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ఆర్థికంగా సంపన్నులైన వారు కూడా ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన లేకపోతే నష్టపోతారన్నారు. కామర్స్ విద్యార్థులకే కాక సమాజంలోని ప్రతి ఒక్కరికీ ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన ఉండాలన్నారు. సదస్సులో అమూల్య ఫైనాన్సియల్ లిటరసీ సెంటర్ సీనియర్ కౌన్సెలర్ కె.రామలక్ష్మయ్య, ఎస్.వెంకటేష్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన



క్రీడాకారులను అభినంధిస్తున్న సీఈఓ రమణ

కర్నూలు (రూరల్): రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులను జిల్లా క్రీడా శాఖ సీఈఓ రమణ మంగళవారం అభినందించారు. సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కృష్ణా జిల్లా నూజివీడులో ఈనెల 29 నుంచి జూలై 2 వరకు జరగనున్న 8వ రాష్ట్ర స్థాయి జూనియర్ బాల బాలికల బాస్కెట్ బాల్ పోటీలలో ప్రతిభ కనపరిచి పతకాలతో తిరిగి రావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం న్యాయవాది శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో క్రీడా దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధాన శిక్షకులు శ్రీనివాసరావు, బాస్కెట్ బాల్ సంఘం కార్యదర్శి దాదాబాషా, సీనియర్ క్రీడాకారులు మురళీకృష్ణ, ప్రతాప్, వలీ, ఫరూక్ పాల్గొన్నారు.

పథకాలు పొంది ఆర్థికంగా ఎదగండి

- ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న పథకాలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్‌తో సూచించారు. మంగళవారం ఆయన స్థానిక 13వ వార్డులో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన అబ్దుల్లాఖాన్ ఎస్టేట్‌లో దుకాణాలకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకొని సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనేక పథకాలు అందిస్తోందన్నారు. వ్యాపారుల బాగు కోసం చేయూత, చేదోడు పథకాలు ఎంతో ఊరటనిస్తాయన్నారు. వీటిని వలంటీరు ద్వారా తెలుసుకుని దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ విజయలక్ష్మి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

అతివలు అన్ని రంగాల్లో రాణించాలి



ఇంటర్న్‌షిప్‌లో పాల్గొన్న విద్యార్థులతో వీసీ ప్రొఫెసర్ సాయిగోపాల్

- క్లస్టర్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సాయిగోపాల్

కర్నూలు కల్చరల్: అతివలు అన్ని రంగాల్లో రాణించాలని క్లస్టర్ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సాయిగోపాల్ అన్నారు. కేవీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో హోమ్‌సైన్స్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన ఇంటర్న్‌షిప్ సమాపనోత్సవంలో వీసీ మాట్లాడుతూ యువత స్వయం ఉపాధి పొందేందుకు వివిధ అంశాల్లో నైపుణ్యాలు సాధించాలన్నారు. విద్యార్థులు హస్తకళలు, చేనేత వస్త్రాలు, కుట్లు, అల్లికలు, ప్రింటింగ్ తదితక వాటిని తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాసులు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇందిరా శాంతి, హోమ్‌సైన్స్ విభాధిపతి ఆరతి చక్ర, అధ్యాపకులు ఝాన్సీరాణి, వసంత, దయాల్ బాగ్ ప్రధాన శిక్షకురాలు పద్మజ పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి సహకరించాలి

కర్నూలు(సెంట్రల్): పాఠశాల అభివృద్ధికి విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని కట్టమంచి రామలింగారెడ్డి స్మారక నగర పాలక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.వెంకటరెడ్డి కోరారు. మంగళవారం పాఠశాలలో తల్లిదండ్రుల కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశానికి పేరెంట్ కమిటీ చైర్‌పర్సన్ ఎస్.మాబాషా, ఉపాధ్యాయురాలు సుగుణమ్మ, డి.వెంకటేశ్వర్లు, ఎస్. వెంకటనరసయ్య, ఎస్.కరీముల్లా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధి కోసం నాడు-నేడు పథకంతో ముందుకెళ్తోందన్నారు. ఇదే క్రమంలో పాఠశాలలో కల్పించిన వసతులను కొందరు ధ్వంసం చేస్తున్నారని, అలాంటి వారిపై విద్యార్థుల తల్లిదండ్రులు కన్నేసి ఉంచాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతన్న వెంకటరెడ్డి

రోగులకు అందుబాటులో ఉండాలి

- ఆదోని ఏరియా ఆసుపత్రిపై ఫిర్యాదులున్నాయి
- వైద్యులు స్థానికంగా ఉండకపోతే చర్యలు
- జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన

కర్నూలు(హాస్పిటల్):ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు వైద్యులు అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. సృజన అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వైద్య ఆరోగ్యశాఖ కార్యక్రమాలపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదోని ఏరియా ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో ఉండటం లేదని ఆదోని సబ్ డివిజన్ కలెక్టర్ తనిఖీల్లో గుర్తించి తన దృష్టికి తెచ్చారన్నారు. వైద్యులు తప్పనిసరిగా రోగులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆదోనిలోనే నివాసం ఉంటున్నారా..? లేక బయటి ప్రాంతాల నుంచి వస్తున్నారా అని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ లింగన్నను కలెక్టర్ ఆరా తీశారు. ఆదోనిలోనే నివాసం ఉంటున్నారని ఆయన సమాధానం ఇచ్చారు. హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ నిధులతో ఆదోని ఆసుపత్రిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని గతంలో చెప్పాను కదా, ఇంకా ఎందుకు చేయించలేదని ఆమె ప్రశ్నించారు. మరమ్మతులు చేయిస్తున్నామని సూపరింటెండెంట్ వివరణ ఇచ్చారు. ఆదోని ఏరియా ఆసుపత్రిపై ఫిర్యాదులు వస్తున్నాయని, రాకుండా రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. మండల స్పెషల్ ఆఫీసర్లు కూడా ఆసుపత్రులను పరిశీలించేలా ఆదేశాలు ఇస్తామని కలెక్టర్ చెప్పారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు నిర్దేశించిన సమయంలో తప్పనిసరిగా ఉండి రోగులకు సేవలు అందజేయాలని తెలిపారు. అలా కాకుండా హాజరు నమోదు చేసి వారి వ్యక్తిగత క్లినిక్‌లలో ఉంటే చర్యలు తప్పవన్నారు. సీహెచ్‌సీల్లో ప్రసవాల శాతాన్ని పెంచే దిశగా కృషి చేయాలని ఆమె ఆదేశించారు. ఎమ్మిగనూరు, పత్తికొండ, కోడుమూరు, ఓర్వకల్ ఆసుపత్రుల్లో వైద్య సిబ్బంది భర్తీ గురించి సంబంధిత అధికారులు ప్రస్తావించారు. అందుకు వీలుగా తగిన చర్యలు తీసుకోవాలని డీసీహెచ్‌ఎస్‌ను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ శ్రీనివాసరావు, డీఐఓ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, టీబీ అధికారి డాక్టర్ ఎల్. భాస్కర్, మలేరియా అధికారి నూకరాజు, ఆదోని ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లింగన్న పాల్గొన్నారు.

త్యాగాలకు ప్రతీక బక్రీద్

- 29న పండుగ జరుకునేందుకు ఏర్పాట్లు
- నమాజు వేళలు ప్రకటించిన మత పెద్దలు



ప్రార్థనలకు సిద్ధం చేసిన ఈద్గాహ్

కర్నూలు(రాజ్‌విహార్): త్యాగాలకు ప్రతీక బక్రీద్. ఈ వేడుక రోజే సౌదీ అరేబియాలోని పవిత్ర మక్కా నగరంలో హజ్ కార్యక్రమం జరుగుతుంది. అదే రోజు ముస్లింలు ఈ పండుగను సంబరంగా చేసుకుంటారు. పండుగ రోజు ప్రతి ముస్లిం స్నానం చేసి, కొత్త దుస్తులు ధరించి ఈద్గాహ్‌లకు చేరుకుంటారు. అక్కడ సమాజ్ చేసిన తరువాత అరబ్బీ ఖుద్బాహ్, ఉర్దూ బయాన్ చదువుతారు. బక్రీద్ ప్రాముఖ్యతను మతపెద్దలు వివరిస్తారు. ప్రవక్త ఇబ్రహీమ్ ఖలీలుల్లా, ఆయన తనయుడు ఇస్మాయిల్ జబీవుల్లా మధ్య జరిగిన వాస్తవ ఘటన మేరకు ఏర్పడిన ఈ పండుగ రోజున ముస్లింలు చేయాల్సిన పుణ్య కార్యాలను వివరిస్తారు. అనంతరం దువా చేసి, సర్వ మానవాళి కోసం అల్లాహ్‌ను ప్రార్థిస్తారు. ఒకరికొకరు 'ఈద్ ముబార్' చెప్పుకొని ఆలింగనం చేసుకుంటారు. దాన ధర్మాలు చేస్తారు. ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులు, బంధు మిత్రులకు పండుగ శుభాకాంక్షలు చెప్పుకొని ఇంట్లో చేసుకున్న తీపి వంటకాలను ఆరగిస్తారు. బక్రీద్ ఈనెల 29న కావడంతో శాంతి యుతంగా నిర్వహించుకునేందుకు మత పెద్దలు ఇప్పటికే ఏర్పాట్లు చేశారు. పలు చోట్ల వక్ఫ్, అధికారులు ఈద్గాహ్‌ల వద్ద తగిన సదుపాయాలు కల్పించారు.

వివిధ చోట్ల రంజాన్ నమాజ్ వేళలు

ఎంపీరియల్ గార్డెన్స్‌లో ఉదయం 6:15 గంటలకు ఈద్ నమాజ్ ప్రారంభమవుతుంది. గడ్డా వీధిలోని షంషియా మదరసా, పాతబస్తీలోని పీలి మసీదులో 6:30, రైల్వే స్టేషన్ సమీపంలోని మసీదు, గడ్డాలోని ఈద్గాహ్‌లో 7, టూ టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న మసీదులో 7:30, రోజా మసీదు, పాత ఈద్గా (కొత్త బస్టాండ్ సమీపంలో)లో 8, కొత్త ఈద్గాహ్ (సంతోష్ నగర్)లో 8:30గంటలకు ఈద్ నమాజ్‌లు ప్రారంభించనున్నట్లు మత పెద్దలు తెలిపారు.







బక్రీద్ పండుగ కోసం కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచుకున్న ఒంటెలు, గొర్రెలు, పొట్టేలు

– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు

గార్గేయపురం పాఠశాల విద్యార్థిని ప్రతిభ



హిమబిందును అభినందిస్తున్న దృశ్యం

కర్నూలు(రూరల్): ఒరిస్సా రాష్ట్రం రూర్కెలలో ఈనెల 28 నుంచి జూలై 7వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి జూనియర్ ఉమెన్ హాకీ పోటీలకు గార్గేయపురం ఉన్నత పాఠశాల విద్యార్థిని బోయ హిమబిందు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. గతంలో యలమంచిలిలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో ప్రతిభ చాటి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు.

ఆటో డ్రైవర్‌పై దాడి

కర్నూలు(రాజ్‌విహార్): నగరంలోని మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో ఓ డ్రైవర్‌పై కొంత మంది యువకులు దాడి చేశారు. మంగళవారం ఆటో డ్రైవర్ వెంకటస్వామి ప్రయాణికులతో బయలుదేరి బుధవారపేటలో నిలిపాడు. షాపు ముందు ఆపి ప్రయాణికులను దింపుతున్న సమయంలో అక్కడే ఉన్న కొంత మంది యువకులు ఆటో డ్రైవర్‌తో గొడవ పడ్డారు. ఇరువురి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. స్థానికులు సర్దిచెప్పగా డ్రైవర్ వెళ్లిపోయాడు. తిరిగి సీ.క్యాంప్ నుంచి బుధవారపేటకు వస్తుండగా ఆటోను గుర్తించి డ్రైవర్‌పై యువకులు దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

2.6 లక్షల బీటీ పత్తి విత్తన ప్యాకెట్లు సిద్ధం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలో బీటీ పత్తి విత్తన ప్యాకెట్లు డిమాండ్‌కు అనుగుణంగా అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి తెలిపారు. ప్రస్తుతం 2.6 లక్షల బీటీ పత్తి విత్తన ప్యాకెట్లు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఆదోని సబ్ డివిజన్‌లో 2023 ఖరీఫ్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు 260 విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహించినట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 24 దుకాణాల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడం ఇతరత్రా కారణాలతో రూ.70.52 లక్షల విలువైన 44.98 క్వింటాళ్ల పత్తి విత్తనాల అమ్మకాలను నిలిపివేశామన్నారు. రెండు దుకాణాల్లో విత్తన చట్టం 1083 ప్రకారం రూ.4.58 లక్షల విలువైన 1.715 క్వింటాళ్ల పత్తి విత్తనాలను సీజ్ చేసి తదుపరి చర్యల కోసం జాయింట్ కలెక్టర్‌కు నివేదించామన్నారు. డివిజన్‌లోని మండల వ్యవసాయ అధికారులు ఇప్పటి వరకు తనిఖీలు నిర్వహించిన దుకాణాల నుంచి 104 పత్తి విత్తన శ్యాంపుల్ సేకరించాలనేది లక్ష్యం కాగా.. 142 శ్యాంపుల్స్ సేకరించినట్లు తెలిపారు. భూసార పరీక్షలకు మట్టి నమూనాలు 2,068 సేకరించాలనేది లక్ష్యం కాగా.. 100 శాతం మట్టి నమూనాలు సేకరించినట్లు పేర్కొన్నారు.

అవగాహనతోనే విద్యుత్ ప్రమాదాల నివారణ

- విద్యుత్ శాఖ ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం.ఉమాపతి

కర్నూలు(రాజ్‌విహార్): అవగాహనతోనే విద్యుత్ ప్రమాదాలు నివారించవచ్చని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం.ఉమాపతి అన్నారు. మంగళవారం స్థానిక విద్యుత్ భవన్‌లోని సమావేశపు హాలులో ఏర్పాటు చేసిన జాతీయ విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో ఆయన మాట్లాడుతూ విద్యుత్ ఎంత అవసరమో అంతే ప్రమాదకరమైందన్నారు. అవగాహన లేకుండా పనులు చేస్తే అనర్థాలు తప్పవన్నారు. భద్రతా పరికరాలు (ఎంసీబీ/ఈఎల్‌సీబీ) ఉపయోగించాలని, సరైన అనుమతి పొంది, అధికారిక సిబ్బందితో విద్యుత్ కనెక్షన్ ఏర్పాటు చేయించుకోవాలని సూచించారు. ఇళ్లు, దుకాణాలు, మోటార్లు, స్టార్టర్లకు సరైన ఎర్తింగ్ ఏర్పాటు చేసుకోవాలని, ప్లగ్ లేకుండా తీగలను నేరుగా సాకెట్‌లో పెట్టరాదని, తడిగా ఉన్నప్పుడు స్తంభాలు తాకరాదని, కింద పడిన తీగలను, స్తంభాలను, వాటికి ఏర్పాటు చేసిన ఆధారపు తీగలను తాకరాదని చెప్పారు. విద్యుత్ తీగలపైన, ఆధారపు తీగలపైన తడి దుస్తులు ఆరవేయరాదన్నారు. విద్యుత్ పనులు చేసే సమయంలో తప్పనిసరిగా రబ్బరు చెప్పులు, రబ్బరు తొడుగులు, విద్యుత్ నిరోధక పరికరాలు, ఎర్త్ రాడ్ వాడాలని, తక్కువ ఎత్తులో తీగల కింద, తీగల వద్ద వ్యవసాయ పనులు నిర్వహించరాదన్నారు. నాణ్యమైన సర్వీసు వైర్లు, మోటార్లు, పరికరాలు మాత్రమే వాడాలన్నారు. లైన్‌మెన్లు, పోల్ టూ పోల్ వర్కర్లు, ఇతర విద్యుత్ సిబ్బంది తగిన జాగ్రత్తలతో పనులు చేయాలన్నారు. పని పూర్తయిందని పక్కాగా ధ్రువీకరించుకున్న తరువాతే సరఫరాను పునరుద్ధరించాలన్నారు. సమావేశంలో విజిలెన్స్ విభాగం సీఐ పార్థసారథిరెడ్డి, ఈఈలు రమేష్, రాజేష్, డీఈఈలు, ఏఈఈలు, వినియోగదారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌ఈ ఎం.ఉమాపతి